# చేతులు

చేతులు నడుస్తున్నాయి.

కోటు జేబుల్లో కాస్సేపూ, పాంటు జేబుల్లో మరి కాస్సేపూ-చేతులు నడుస్తున్నాయి.

కుడిచెయ్యి కోటు జేబులో దూరి చేతి రుమాలు- సెంటు పూసిన సిల్కు రుమాలు బయటికి తీసింది. మొహం తుడిచింది ఎడంచెయ్యి జుట్టు సవరించింది కళ్ళజోడు సరిదిద్దింది

కుడిచెయ్యి మణికట్టు కళ్ళముందుకొచ్చింది ఎండలో స్మగుల్డ్ వాచ్ ధగధగ! ఇటీజ్ ఫైవ్ పాస్టెలెవెన్! త్వరగా వెళ్ళాలి.

రెండు చేతులూ ఊగుతూ నడుస్తున్నాయి. "బాబూ? ఒక పైసా బాబూ! రెండుచేతులూ లేవు బాబూ అవిటోణ్ణి బాబూ!- పేవ్‌మెంటుమీద చతికిలబడి కూర్చుని అరుపులు, మెడలో వేళ్ళాడుతూ అంచులకి తిరగ కట్టిన పాత డబ్బా భుజానికి వేళ్ళాడుతూ మొండిచేతులు, మోచేతులు

వరకూ చేతుల్లేవు "బాబూ! ఒక పైసా బాబూ! చేతుల్లేని అవిటోణ్ణి బాబూ!"

"లేదుపోరా!"-ఊగుతూ నడుస్తున్న రెండుచేతుల్లో కుడిచెయ్యి లేదు పొమ్మన్నట్టు ఊగి, కోటు జేబులో దూరి దాక్కుంది. బయటికి రాలేదు. ముందుకు సాగిపోయింది.

"హలో మిస్టర్ రావ్! హౌ ఆర్ యూ!" కోటు జేబులో దాక్కున్న చెయ్యి బయటికొచ్చి ఎదురొచ్చిన చేత్తో కలిసింది. ఒకవూపు వూగి విడిపోయింది.

రెండు చేతులూ వూగుతూ మళ్ళీ ముందుకు నడిచాయి. "వాడి చెయ్యి అలా వుందేమిటి చచ్చినవాడి చెయ్యిలా చల్లగా!"

"రిక్షా కావాలా బాబూ!" దక్కకొచ్చి ఆగింది రిక్షా. హాండిల్ మీద నల్లటి చేతులు, మొఱటుగా, మొద్దుగా చెమటలు కక్కుతున్న చేతులు. చేతులకి చొక్కా లేదు.

రిక్షా కావాలా బాబూ!

వద్దు పోరా!

హాండిల్ మీద చేతులు వెనక్కి తిరిగి వెళ్ళిపోయాయి. "ఐ హేటు దీస్ ఫెలోస్! అయినా నేను రిక్షా ఎక్కడమేమిటి?"

మళ్ళీ వూగుతూ నడుస్తూ చేతులు.

టాక్సీ! ఏయ్ టాక్సీ!

టాక్సీ ఆగింది. స్టీరింగ్ మీద కాకిచొక్కాలో నల్లటి పుల్లల్లాంటి చేతులు.

ఎక్కడికి పోవాలి సార్?

కుడిచెయ్యి డోర్ తెరచింది. రెండుచేతులూ లోపలికి దూరి దర్జాగా కూర్చున్నాయి. ఎడం చెయ్యి డోర్ మూసింది.

కారు ముందుకి నడిచింది. వేగం పుంజుకుంది, దడ దడ దడదడ...ఏదో శబ్దం.

డోర్ సరిగా పడలేదు సార్!

కారు వేగం తగ్గింది. స్టీరింగ్ మీదనుంచి నల్లటి, పుల్లలాటి చెయ్యి వెనక్కొచ్చి డోరు గట్టిగా లాగికొట్టింది. కారు మళ్ళీ స్పీడందుకుంది.

నాకు డోర్ వెయ్యటం రాదనుకున్నాడు కాబోలు, వెధవ కారూ వీడూను, దీని తాతలాంటికారు కొంటాను. కొనాలి ఇక లాభంలేదు.

చెయ్యి జేబులోదూరి, సిగరెట్ పాకెటు, అగ్గిపెట్టె తీసింది. రెండుచేతులూ కలిసి వెలిగించాయి దర్జాగా. సీటు మీదికి, వెనక్కి రెండువేపులా రెండు బారజాపు కూచున్నాయి.

స్టీరింగ్ మీద నల్లచేతుల్లో ఒకటి కాకి చొక్కా జేబులోకి దూరి బీడీ, తీసింది, అగ్గిపెట్టెతీసింది. వెలిగించింది,

రాగి జుట్టులోకి, మారింది అద్దంముందుకి కొద్దిగా వంగిన తలలో జుట్టుసవరించింది.

ఓరి వీడి స్టయిల్ తగలడా! ఒక్క చేత్తో ఎంతషోగ్గా డ్రైవ్ చేస్తున్నాడు.

లెఫ్ట్! లెఫ్ట్! రైట్ రైట్, రైట్!

ఎండు కట్టెలాంటి, నల్లటిచెయ్యి ఒక్కటే స్టీరింగ్ మీద సుతారంగా వేగంగా, చురుగ్గా కదులుతోంది కారు టాప్ స్పీడులో పరుగెడుతోంది.

ఇలాంటి కేర్ లెస్ వెధవల్తో ప్రమాదం, ఆ చెయ్యి చూడు ఎలా వుందో పుల్లలా... ఇలా తిరుగుతూ తిరుగుతూ ఎక్కడో పుటుక్కున విరిగి ఊరుకుంటుంది...అసలిలాంటి చేతులేమిటి స్టీరింగ్ మీద?... కారు నడిపే చేతులెంత దర్జాగా వుండాలి!... ఆc ఆc... స్టాప్ హియర్! ఇక్కడాపవోయ్.

సడెన్ బ్రేక్, కారు కీచుమంటూ ఆగింది

కోటు చేతులు కారులోంచి కిందికి దిగాయి

నల్లటి, పుల్లలాంటి చెయ్యి కారులోంచి దిగకుండానే, బయటికొచ్చింది. అరచెయ్యి కూడా నలుపే. కోటుచెయ్యి కోటు జేబులోంచి డబ్బుతీసి యిచ్చింది స్టీరింగ్ మీది చెయ్యి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

కోటు చేతులు గేటు లోపలికి నడిచాయి మెట్లెక్కాయి. కోటు చేతులు చూడగానే హాల్లో కూర్చున్న

చేతులన్నీ లేచి నిలబడ్డాయి. మగచేతులు, ఆడచేతులు, పొడుగు చొక్కాల చేతులు, బుష్ షర్టుల చేతులు, బిగువు జాకెట్ల చేతులు, గుమాస్తా చేతులు... అన్నీ పైకి లేచాయ్ !

గుడ్ మార్నింగ్ సార్!

నమస్కారం సార్!

గుడ్ మార్నింగ్ సార్!

కోటు చేతులు చలించకుండా, కోటు జేబుల్లో దూరి స్టయిల్ గా, ఠీవిగా, టకటకా నడుచుకుంటూ ముందుకి సాగిపోయాయ్

ముసలి చెయ్యొకటి, ముడతలు పడ్డ చెయ్యొకటిరూమ్ ముందు నిలబడి సలాం కొట్టింది రెండో ముసలి చెయ్యి స్ప్రింగ్ డోర్ లాగి పట్టుకుంది.

కోటుచేతులు దర్జాగా లోపలికి నడిచి కుషన్ చెయిర్లో రిలాక్సయి కూర్చున్నాయి. కుడి చెయ్యి కోటు జేబులోంచి చేతిరుమాలు - సెంటు పూసిన సిల్కు రుమాలు తీసి మొహం తుడిచింది.

ముసలిచెయ్యి గబాగబా వచ్చి, ఫాన్ ఆన్ చేసింది.

మంచి నీళ్ళు పట్రా!

సిత్తం బాబూ!

ముసలి చేతులు మంచి నీళ్ళు తెచ్చాయి.

ఒరేయ్ రాస్కెల్! గ్లాసులో వేళ్ళు మునగ నివ్వొద్దని ఎన్నిసార్లు చెప్పాన్రా నీకు? వెధవ చేతులు నువ్వూను నీ వేళ్ళన్నీ అందులో ముంచి...

పొరపాటై పోయింది బాబూ...మన్నించండి...మళ్ళీ తెత్తాను...గ్లాసు పట్టుకున్న ముసలి చేతులు, ముడతలుపడ్డ చేతులు వణికాయి

స్టెనోని ఒకసారి రమ్మను.

సిత్తం బాబూ!

స్వింగ్ డోర్ తెరుచుకుని స్లీవ్ లెస్ చేతులు వయ్యారంగా లోపలికి వచ్చాయి.

గుడ్ మార్నింగ్ సార్!

గుడ్ మార్నింగ్! టైప్ దిస్ లెటర్!

యస్ సార్!

స్లీవ్ లెస్ చేతులు... గుండ్రంగా ... సన్నగా ... పచ్చగా వున్న చేతులు- ముందుకొచ్చాయి.

కోటు చెయ్యి లెటరు అందించింది.

స్లీవ్ లెస్ చేతులు పక్క టేబుల్ ముందు కూర్చుని, టైప్ మిషన్ ముందుకు లాక్కున్నాయి.

టక్ టక్ ...టక్ టక్ టక్ ట...టక్ టక్ ... టక్ టక్ టక్ ...టక్ టక్ టక్ ...

పచ్చగా, పొడుగ్గా, సన్నగా, నేవళంగా వున్న వేళ్ళు అందంగా, సుతారంగా, వేగంగా కదులుతున్నాయి.

లంద వేళ్ళు బావున్నాయి-సెక్సీగా!... మిస్ రాణీ! టేక్ దిస్ పేపర్ ఆలోన్సు...

ఓ కే సార్!

స్లీవ్‌లెస్ చేతుల అందంచూసి, కోటుచేతులకి పిచ్చెక్కింది. ఆ చేతుల్ని పట్టుకుని నిమిరి... నొక్కి...పిసికి... కోరికతో కోటు చేతుల వేళ్ళు కొంకర్లు పోయాయి

మిస్ రాణీ! ఐ లైక్ యూ వెరీమచ్! ఐ వాంట్ టూ ఎన్‌హాన్స్ యువర్ ఫీ. ఫ్రమ్ నెక్ట్స మంత్!

థాంక్యూ సర్! థాంక్యూ వెరీమచ్!

ఇంకెక్కడికి పోతాయ్ దీని చేతులు నాకు దొరక్క?

చేతులే యి త బావుంటే...

ముసలి చేతులు ఒక విజిటింగ్ కార్డు తెచ్చి టేబిల్ మీద పెట్టాయి కోటు చెయ్యి దాన్ని పరీక్షించి, లోపలికి తీసుకు రమ్మన్నట్టుగా సైగచేసింది

సిల్కు లాల్చి చేతులు - ఒక చేత్తో స్వీటు ఎక్స ప్రెస్ పాకెట్టూ ఒకచేత్తో, సిగరెట్టూ పుచ్చుకుని దర్జాగా లోపలి కొచ్చాయి

హల్లో మిష్టర్ రావ్!

అయ్యా అయ్యా నమస్కారం, దయచెయ్యండి,దయ చెయ్యండి... కూర్చోండి!

లాల్చి చేతులు రెండూ దర్జాగా ముందు కొంగి, టేబిల్ మీద ఆనుకొని కూర్చున్నాయి. పాకెటులోంచి సిగ రెటు కొద్దిగా బయటికి లాగి ముందుకు చాచాయి

అబ్బే, వద్దండి...

ఫర్వాలేదు, తీసుకోండి ..

కోటు చేతులు సిగరెటు తీసుకున్నాయి, లాల్చీ చెయ్యి, జేబులోంచి, బంగారపూత పూసిన లైటరు తీసి సిగరెట్టు వెలిగించింది.

లాల్చీ చేతులూ, కోటు చేతులూ చాలసేపు మాట్లాడుకున్నాయి. తర్వాత అవీ యివీ కూడ టేబిల్ కిందికి దూరాయి లాల్చీ చేతులోంచి కోటు చేతులోకినోట్ల కట్ట మారింది.

వెళ్ళేముందు లాల్చీ చెయ్యి కోటు చేతిని పట్టుకుని వూపింది. శెలవు దీసుకు వెళ్ళిపోయింది.

అబ్బ ఎంత మెత్తగా వుంది వీడి చెయ్యి, ఆడదాని చేతిలా!- అవున్లే, వాడికేమిటి మిలియనీరు...నోట్లు లెక్క పెట్టడం తప్ప వాడికి పనేముంది ..?

మే ఐ కమిన్ సర్?

వూఁ...

బక్కగా, తెల్లగా పాలిపోయి లూజ్ గా, మాసిపోయివున్న చొక్కాతో వేళ్ళాడుతూ రెండు చేతులు లోపలికొచ్చాయి. నమస్కారం చేశాయి.

ఏమోయ్, ఏం కావాలి?

పాలిపోయిన బక్క చేతులు కాస్సేపు చేతులు కట్టుకుని నిలబడ్డాయి. ఏదేదో గొణిగాయి, వణుకు తున్నాయి. కాస్త ముందు కొచ్చి టేబిల్ మీద ఆనుకున్నాయి. పెళ్లాం కానుపు గురించీ, పిల్లల రోగాల గురించీ, ఇంక్రిమెంట్ల గురించి జడుస్తూ జడుస్తూ మాట్లాడుతున్నాయి.

కోటు చేతులకి చిరాగ్గా వుంది. టేబిల్ మీద తెల్లగా, బక్కగా, పాలిపోయి, నరాలు పైకి తేలి, ఎండిపోయిన చేతులు అసహ్యంగా, భయభయంగా కదులుతున్నాయి నాముందు టేబిల్ మీద చేతులానించి నిలబడతాయా, వెధవ చేతులు ..ఏడుపుగొట్టు చేతులు... ఎంత పొగరు...?

రిమూవ్డ్ హాండ్స్ ఫస్ట్, కాంటు యూస్టాండ్ ఎరక్ట్ ?

సారీ సర్! సారీ .. - టేబిల్ మీద వాలిన బక్క చేతులు భయాంభయంగా వెనక్కి వెళ్ళిపోయాయి.

ఎప్పుడూ డబ్బుకోసం ఏడుపే. ఇక్కడేం లాభం లేదు... వెళ్ళిపో .. వెళ్ళు వెళ్ళు !

బక్క చేతులు నీరసంగాదిగులుగా, లూజుచొక్కాలో వేళ్ళాడుతూ రూమ్‌లోంచి బయటికి వెళ్ళిపోయాయి.